సాక్షి వనపర్తి

గురువారం • 8 • ఫిబ్రవరి • 2024



ట్రేడర్ల దోపిడీ

వేరుశనగకు గిట్టుబాటు ధర చెల్లించడం లేదని అచ్చంపేటలో రైతులు రోడ్డెక్కారు.

వివరాలు 8లో ▸



వీసీ చాంబర్‌కు తాళం

ఏబీవీపీ ఆధ్వర్యంలో చేపట్టిన చలో పీయూ కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
38.2 /18.7

వాతావరణం

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరగగా.. ఉదయం, రాత్రి చలి కాస్త తగ్గుముఖం పట్టింది.

న్యూస్‌రీల్

పర్యావరణ పరిరక్షణ.. విద్యార్థుల బాధ్యత



వనపర్తిటౌన్: పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్ర కీలకమని ఎన్జీసీ మేనేజర్ శివకిరణ్ అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో అడవులు, వాతావరణ మార్పులశాఖ భారత ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర జాతీయ హరితదళం (టీఎస్ ఎన్జీసీ) విద్యాశాఖ సమన్వయంతో 'సుస్థిర జీవన విధానం' అనే అంశంపై జిల్లా ఎన్జీసీ కో–ఆర్డినేటర్ ఐ.సుదర్శన్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి వర్క్‌షాప్‌కు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా పర్యావరణ అంశాలను ప్రయోగాత్మకంగా వివరించి పరిశుభ్రత ప్రాముఖ్యత, తడి, పొడి చెత్త వేరుచేసే విధానాన్ని వివరించారు. ప్లాస్టిక్ భూమిలో విచ్ఛిన్నం కాకుండా పరిసరాలను ఎలా కలుషితం చేస్తుందో తెలియజేశారు. ఉదయాన్నే నిద్ర లేవడం, వ్యాయామం, యోగా చేయడం, చేతిసంచుల వినియోగం, ఆహారంలో పండ్లు, కూరగాయలు తీసుకోవడం, పరిసరాలను హరితయుతంగా మార్చడం, నీటిని పొదుపుగా వినియోగించడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం డీఈఓ గోవిందరాజులు మాట్లాడుతూ.. నిత్య జీవితంలో ప్లాస్టిక్‌ను ఎక్కువగా వాడటంతోనే వాతావరణం కలుషితం అవుతుందని తెలిపారు. వాటి అవశేషాలు ఆహారపు గొలుసుతో శరీరంలోకి ప్రవేశించి క్యాన్సర్, ప్రమాదకర వ్యాధుల బారిన పడుతారని చెప్పారు. పర్యావరణ ప్రాముఖ్యతను తెలుసుకోవాలని సూచించారు. మెజీషియన్ పూర్ణచందర్ తన ప్రదర్శనలతో విద్యార్థులను ఆకట్టుకున్నారు. అనంతరం చేతి సంచులను విద్యార్థులకు అందజేశారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం



అమరచింత: జిల్లాలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సీపీఐ ఆధ్వర్యంలో ప్రజల పక్షాన పోరాటాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన మండల ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై స్థానిక సమస్యల గురించి చర్చించారు. అనంతరం మాట్లాడుతూ.. పట్టణంలో దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. పుర పాలకవర్గం ప్రజా సమస్యలను విస్మరించిందని.. కాల్వల్లో మురుగు పేరుకుపోయినా తొలగించడం లేదని తెలిపారు. సీసీ రహదారులు, మరుగుదొడ్లు, విద్యుత్ తీగలు, ఇళ్లు, ఇళ్లస్థలాలు, రేషన్ కార్డులు అర్హులైన ప్రతి ఒక్కరికి అందించేందుకు కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా ఈ నెల 16న చేపట్టే గ్రామీణబంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ నెల 21, 22న కొంకన్వానిపల్లెలో మక్తల్ నియోజకవర్గస్థాయి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సీపీఐ మండల, పట్టణ కార్యదర్శులు అబ్రహం, భాస్కర్, నాయకులు శ్యాంసుందర్, కుమార్, గీతమ్మ, రవీందర్, ఇబ్రాయిల్, సాలు, కతలప్ప, నిస్సార్ పాల్గొన్నారు.

బీడీ పరిశ్రమ రక్షణకు ఉద్యమిద్దాం

ఆత్మకూర్: దేశవ్యాప్తంగా బీడీ పరిశ్రమలపై ఆధారపడి కోట్లాది మంది కార్మికులు జీవిస్తున్నారని.. ఈ పరిశ్రమలను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు పూనుతోందని తెలంగాణ ప్రగతిశీల బీడీ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి అరుణ్‌కుమార్ ఆరోపించారు. బుధవారం మండలంలోని మూలమళ్లలో జరిగిన ఇఫ్టూ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ నెల 16న దేశవ్యాప్తంగా చేపట్టే సార్వత్రిక సమ్మెలో కార్మికులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సామేలు, దేవరాజు, మాణిక్యమ్మ, వెంకటన్న, సువర్ణ, బేబీ, లక్ష్మీప్రసన్న, సవరమ్మ, కృష్ణయ్య పాల్గొన్నారు.

కంది క్వింటా రూ.10,183

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం కంది క్వింటా గరిష్టంగా రూ.10,183, కనిష్టంగా రూ.9,840 ధర లభించింది. ఈ సీజన్‌లో ఇంత ధర లభించడం ఇదే మొదటిసారని యార్డు అధికారులు తెలిపారు. అలాగే వేరుశనగ రూ.7,276–రూ.4,390, వరి ఆర్ఎన్ఆర్ రకానికి రూ.3,168, మొక్కజొన్న రూ.1,952, పత్తి గరిష్టంగా రూ.6,429, కనిష్టంగా రూ.5,179, జొన్నలు గరిష్టంగా రూ.5,754, కనిష్టంగా రూ.2,010, పెబ్బర్లు రూ.7,416, మినుములు రూ.9,139, ఉలువలు రూ.7,267 చొప్పున పలికాయి.

పడకేసిన విస్తరణ..!

జిల్లాకేంద్రంలో అసంపూర్తిగా రహదారి వెడల్పు పనులు



యూకో బ్యాంక్ వద్ద అసంపూర్తిగా రహదారి విస్తరణ పనులు

- ఇబ్బందులు పడుతున్న పట్టణవాసులు, వాహనదారులు
- తొలగించిన ర్యాంపులను నిర్మించుకుంటున్న యజమానులు
- పనుల కొనసాగింపుపై సందిగ్ధం

వనపర్తి టౌన్: జిల్లాకేంద్రంలో రహదారి విస్తరణ పూర్తవుతుందా? లేదా?.. పనులు ఎప్పుడు ప్రారంభించి పూర్తి చేస్తారనే చర్చ పట్టణంలో సామాన్య ప్రజల నుంచి మొదలు రాజకీయ నేతల వరకు జోరుగా సాగుతోంది. ప్రభుత్వం మారడంతో పనులు పడకేశాయని, కొత్త ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం లేదని, గతంలో చేసిన కొన్ని పనులకు బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు ముందుకురావడం లేదని, ఇప్పుడిప్పుడే అధికారంలోకి రావడంతో కాస్త సమయం పడుతుందని ఇలా ఒక్కొక్కరు ఒక్కోరకంగా మాట్లాడుకోవడం కనిపిస్తోంది. వ్యాపార సముదాయాలున్న బస్టాండ్ మార్గంలో ఆర్నెల్ల క్రితం రహదారి విస్తరణ కోసం మున్సిపల్ అధికార యంత్రాంగం దుకాణాల ఎదుట ఉన్న ర్యాంపులను పొక్లెయిన్ సాయంతో తొలగించింది. అలాగే కొన్ని నివాసాలను యాజమానులు విస్తరణకు అనువుగా తొలగించుకున్నారు. ఈ దశలోనే పలువురు వ్యాపారులు పట్టణంలో మిగతా ప్రాంతాల్లో జరిగినట్లుగా విస్తరణ చేపట్టాలని కోరగా అధికారులు, ప్రజాప్రతినిధులు 100 అడుగులు విస్తరిస్తామని చెప్పారు. ఈ క్రమంలోనే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో దుకాణాల ఎదుట తీసిన గుంతలు, తొలగించిన ర్యాంపులు అలాగే ఉండిపోయాయి. ప్రస్తుతం వ్యాపారులు తీసిన గుంతలు పూడ్చుకుంటూ పక్కాగా ర్యాంపులను నిర్మించుకుంటుండటంతో ఇప్పట్లో విస్తరణ ఉంటుందా? లేదా? అన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. మొదట్లో పేదలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో విస్తరణ చేపట్టారని, బడా బాబులుండే చోట్ల విస్తరణ చేయరా? అనే భావన నెలకొన్న తరుణంలోనే బస్టాండ్ మార్గంలో విస్తరణ పనులు ప్రారంభంకాగా.. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.



బస్టాండ్ మార్గంలో తీసిన గుంతలను పూడ్చి నిర్మాణాలు చేపడుతున్న దుకాణదారులు

అసంపూర్తి పనులతో అవస్థలు..

జిల్లాకేంద్రంలో 2020, ఏప్రిల్ 25న మొదలైన రహదారి విస్తరణ పనులు చిట్యాల రోడ్డు, హైదరాబాద్ రోడ్డు, పాన్‌గల్ రహదారి, రాజీవ్‌చౌక్ మార్గాల్లో దశల వారీగా చేపడుతూ వచ్చారు. చిట్యాల రోడ్డులో చింతల హనుమాన్ ఆలయం నుంచి అర కిలోమీటర్ వరకు ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. హైదరాబాద్ మార్గంలో కన్యకాపరమేశ్వరి ఆలయం నుంచి పాతబజార్ వరకు అసంపూర్తిగా ఉండటంతో పాటు ఓవైపు రోడ్డు నిర్మాణం, మరోవైపు లోయ తరహాలో రహదారిని అలాగే వదిలేశారు. రామా థియేటర్ నుంచి మాత్రెమ్మకుంట మలుపు వరకు మిగిలిన విస్తరణ పనులను ఏమాత్రం పట్టించుకోకపోవడంతో తీవ్ర హెచ్చుతగ్గులు ఉండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. పాన్‌గల్ రహదారిలో విస్తరణ పనులు ప్రారంభించి నిలిపివేశారు. దీంతో ఇప్పటికే ఇళ్లు తొలగించుకున్న వారు ఆందోళన చెందుతుండగా.. తొలగించుకోవాల్సిన వారు సందిగ్ధంలో పడ్డారు. నెలల తరబడి ఎక్కడి పనులు అక్కడే ఉండటంతో అధికారులు కూడా వీటిపై దృష్టి సారిస్తున్నట్లు కనిపించడం లేదు.

అనువుగా ఉంటే పనులు ప్రారంభిస్తాం..

మొదటి దశలో భాగంగా విద్యుత్ స్తంభాల మార్పు, అవసరమైన చోట్ల డ్రెయినేజీల నిర్మాణం చేపట్టాం. గాంధీచౌక్, పాతబజార్‌లో ఆలయాలు, అంబేడ్కర్ చౌక్‌లో ఒక ఇల్లు అడ్డంగా ఉన్నాయి. జమ్మిచెట్టు సమీపంలో ఎడమవైపు డ్రెయినేజీ నిర్మాణం వదిలేశారు. అవన్నీ తొలగిస్తే పనులు పూర్తి చేయడానికి వీలవుతుంది. అసంపూర్తిగా మిగిలిన చోట్ల కూడా ఇవే సమస్యలు ఉండటంతో ముందుకెళ్లలేకపోతున్నాం. బస్టాండ్, పాన్‌గల్ మార్గంలో అన్నీ క్లియర్ చేస్తే పనులు ప్రారంభిస్తాం.

– దానయ్య, డీఈ, రహదారులు, భవనాలశాఖ

సందిగ్ధంలో ఉన్నారు..



గతంలో ఇచ్చిన ప్రొసీడింగ్‌లకు డబ్బులు చెల్లిస్తారా? లేదా ? అనే సందిగ్ధంలో కాంట్రాక్టర్లు ఉన్నారు. ఇప్పటికే పలు దఫాలుగా సమావేశాలు నిర్వహించి నిధులు మంజూరవుతాయి.. పనులు చేపట్టాలని సూచించాం. ఉన్నతాధికారులు హామీ ఇస్తే పనులు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెబుతున్నారు. గతంలో చేసిన కొన్ని పనులకు నేటికీ డబ్బులు రాలేదని చెబుతున్నా.. పనులు ప్రారంభించాలంటూ ఒత్తిడి తెస్తున్నాం.

– విక్రమసింహారెడ్డి, పుర కమిషనర్, వనపర్తి

నెలాఖరు వరకు సీఎంఆర్ అప్పగించాల్సిందే



వైద్య, ఆరోగ్యశాఖ, డీడబ్ల్యూఓ అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ పవార్

- కలెక్టర్ తేజస్ పవార్

వనపర్తి: మిల్లర్లు ఈ నెలాఖరు వరకు ఎఫ్‌సీఐకి సీఎంఆర్ పూర్తిగా అప్పగించాలని కలెక్టర్ తేజస్ పవార్ కోరారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సీఎంఆర్ సేకరణపై అదనపు కలెక్టర్ ఎస్.తిరుపతిరావుతో కలిసి రైస్‌మిల్ అసోసియేషన్ నాయకులు, మిల్లర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మిల్లులకు కేటాయించిన వరి ధాన్యం లెక్కల ప్రకారం బియ్యాన్ని ఎఫ్‌సీఐకి ఇవ్వాలని.. నిర్లక్ష్యం చేస్తే ఆర్ఆర్ యాక్ట్ అమలు చేస్తామని హెచ్చరించారు. మిల్లుల వారీగా 2021 నుంచి ఇప్పటి వరకు ధాన్యం కేటాయింపులు, అప్పగించిన సీఎంఆర్‌పై సమీక్షించారు. ఇప్పటి వరకు చాలా అవకాశాలు ఇచ్చామని.. ఇకపై ఉపేక్షించబోమన్నారు. సీఎంఆర్ పెండింగ్ ఉన్న మిల్లులు రోజుకు రెండు విడతల్లో మిల్లింగ్ చేయాలని, ఏ ఒక్కరూ నిర్లక్ష్యం చేయొద్దని కోరారు. రైస్‌మిల్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్, ఉపాధ్యక్షుడు పరమేష్, రైస్ మిల్లర్లు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో సౌకర్యాలు కల్పించాలి..

అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, టాయిలెట్స్, ఆటసామగ్రి తదితర సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ తేజస్ పవార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా సంక్షేమశాఖ, సీడీపీఓలతో జరిగిన సమీక్షలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లతో అధికారులు ప్రతి వారం సమీక్ష నిర్వహించాలన్నారు. ఈ నెల 14వ తేదీ వరకు అన్ని గ్రామపంచాయతీల్లో నిర్వహించే ప్రత్యేక పారిశుద్ధ్య వారోత్సవాల్లో కేంద్రాల పరిశుభ్రత, సందర్శన ఉండేలా ఒకరోజు కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. తాగునీరు, మరుగుదొడ్లు, ఎత్తు, బరువు కొలిచే పరికరాలు, ఆట వస్తువులు తదితర సౌకర్యాలు ఎక్కడ లేవో గుర్తించి నివేదిక ఇవ్వాలన్నారు. బాలామృతం పంపిణీపై పర్యవేక్షణ ఉండాలని, పిల్లలకు ఇచ్చే గుడ్లు నాణ్యతగా లేకుంటే తిరిగి పంపించాలని సూచించారు. ఆరోగ్యలక్ష్మి మానిటరింగ్ కమిటీ సమావేశం ప్రతి వారం నిర్వహించాలన్నారు.

ప్రసూతి మరణాలను తగ్గించాలి..

జిల్లాలో ప్రసూతి మరణాలను పూర్తిగా తగ్గించడమే లక్ష్యంగా పని చేయాలని కలెక్టర్ తేజస్ పవార్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ, శిశు సంక్షేమశాఖ అధికారులతో ప్రసూతి మరణాలపై నిర్వహించిన సమీక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ త్రైమాసికంలో 2023, అక్టోబర్ 7న మదనాపురం మండలం దుప్పల్లికి చెందిన పల్లెపాగ ప్రత్యూష, 2023, డిసెంబర్ 16న పెబ్బేరు మండలం తోమాలపల్లికి చెందిన బాలింత గుడిసె మనీషా మరణానికి గల కారణాలు, గైనకాలజిస్ట్, కేస్ షీట్, ఆశ, ఏఎన్ఎం, బాధితుల తరఫున బంధువుల వివరణ తీసుకొని పరిశీలించారు. ఎట్టి పరిస్థితుల్లో ప్రసూతి మరణాలు సంభవించకూడదని.. ముందుగానే ప్రణాళిక చేసుకొని మాత, శిశు ప్రాణాలు కాపాడాలని ఆదేశించారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే మరణాలు సంభవించినట్లు తెలిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. హైరిస్క్ కేసులు ఏమైనా వస్తే తప్పనిసరిగా జీజీహెచ్‌కు రెఫర్ చేయాలని సూచించారు. రక్తహీనత, హైరిస్క్ కేసులు ముందుగా గుర్తించి తగిన వైద్యం అందించాలన్నారు. ప్రసవానంతరం 45 రోజుల పాటు కేంద్ర ఆరోగ్యశాఖ నిబంధనల మేరకు 3, 7, 14, 21, 28, 42వ రోజు సంబంధిత వైద్యుడు, ఏఎన్ఎం తప్పనిసరిగా బాలింత ఇంటికెళ్లి పరీక్షించాలని ఆదేశించారు. టీకాలు, అనీమియాకు సంబంధించి ప్రతి వారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిలో సమీక్ష నిర్వహించాలన్నారు. ఆశాలు, ఏఎన్ఎంలు గృహ సందర్శన చేస్తున్నారా లేదా అనే విషయంపై మెడికల్ ఆఫీసర్లు పర్యవేక్షణ చేయాలని సూచించారు. స్యామ్, మ్యామ్ పిల్లలు, రక్తహీనత కలిగిన గర్భిణుల నివేదికలు, అంగన్‌వాడి, ఆశా వర్కర్ల నివేదికలు భిన్నంగా ఉండటమేంటని ప్రశ్నించారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి డా. జయచంద్రమోహన్, జిల్లా సంక్షేమ అధికారి రామమహేశ్వర్‌రెడ్డి, గైనకాలజిస్ట్ హెడ్ అరుణకుమారి, ఎన్‌సీడీ ప్రాజెక్ట్ అధికారి రాంచందర్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా. శ్రీనివాసులు, ఇమ్యూనైజేషన్ అధికారి డా. పరిమళ, ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా ముందుకు..

- ప్రణాళికతో కార్యక్రమాల నిర్వహణ
- డీపీఓ సురేష్‌కుమార్

అమరచింత: జిల్లాలోని పల్లెలను సంపూర్ణ పారిశుద్ధ్య గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టిందని.. గ్రామస్తులు స్వచ్ఛందంగా కలిసిరావాలని డీపీఓ సురేష్‌కుమార్ కోరారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణను పరిశీలించేందుకు బుధవారం మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో ఆయన ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో గ్రామసభ నిర్వహించి ప్రభుత్వ ఉద్దేశం, బుధవారం నుంచి ఈ నెల 15 వరకు రోజువారీగా నిర్వహించే కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. రహదారుల శుభ్రత, ఇంట్లోని తడి, పొడి చెత్తను డంపింగ్‌యార్డ్‌కు తరలించడం, రహదారుల ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలు వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులతో కలిసి రహదారుల శుభ్రత, పిచ్చిమొక్కల తొలగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని, మురుగు గుంతల్లో ఆయిల్ బాల్స్ వేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ జ్యోతి, ఎంపీఓ నర్సింహులు తదితరులు ఉన్నారు.



రహదారుల శుభ్రతను పరిశీలిస్తున్న డీపీఓ సురేష్‌కుమార్

గృహజ్యోతి అమలుకు కసరత్తు



జిల్లాకేంద్రంలో వివరాలు నమోదు చేసుకుంటున్న విద్యుత్ సిబ్బంది, పక్కన ఎస్ఈ నాగేంద్రకుమార్

వనపర్తిటౌన్: గృహజ్యోతి పథకం అమలుకు అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. ప్రజాపాలన గ్రామసభల్లో స్వీకరించిన దరఖాస్తులతో పాటు దరఖాస్తు చేయని అర్హుల వివరాలు సైతం సేకరించే ప్రక్రియను రెండ్రోజులుగా చేపడుతున్నారు. బుధవారం ఎస్ఈ నాగేంద్రకుమార్ డీఈ నరేందర్‌కుమార్‌తో కలిసి జిల్లాకేంద్రం, వివిధ మండలాల్లో పర్యటిస్తూ దిగువస్థాయి అధికారులు, సిబ్బందిని వివరాల సేకరణలో వేగం పెంచేలా చూస్తున్నారు. యంత్రాల్లో ఆధార్, తెల్ల రేషన్ కార్డు, మొబైల్ నంబర్లను నమోదు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్ఈ నాగేంద్రకుమార్ మాట్లాడుతూ.. ప్రజాపాలన గ్రామసభల దరఖాస్తులకు అనుగుణంగా ప్రక్రియ చేపడుతున్నామని, దరఖాస్తు చేసుకోని అర్హుల వివరాలు సైతం సేకరిస్తున్నామని చెప్పారు. ప్రజలు ఇంటికి వచ్చే విద్యుత్ సిబ్బందికి ఆధార్, రేషన్‌కార్డు, మొబైల్ నంబర్‌ను తెలియజేసి సహకరించాలని కోరారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. సర్కిల్ పరిధిలో తనతో పాటు డీఈ, ఏడీలు, ఏఈలు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తూ వివరాల నమోదులో నిమగ్నమయ్యారని వివరించారు.

వనపర్తి అభివృద్ధికి ముఖ్యమంత్రి హామీ

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి: తాను విద్యనభ్యసించిన వనపర్తి ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి వెల్లడించారు. త్వరలో ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాలను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను వివరించేందుకు బుధవారం రాష్ట్ర సచివాలయంలో సీఎంను కలిసినట్లు తెలిపారు. జిల్లాకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, పాలిటెక్నిక్ కళాశాల తదితర అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరగా సానుకూలంగా స్పందించారన్నారు. అలాగే నియోజకవర్గంలోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు, కాల్వల నిర్మాణం తదితర అంశాలను వివరించినట్లు చెప్పారు.

రహదారుల పునరుద్ధరణకు..

నియోజకవర్గంలోని రెండు మున్సిపాలిటీలతో పాటు ఏడు మండలాల్లో రహదారుల పునరుద్ధరణ విషయమై బుధవారం సచివాలయంలో రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసినట్లు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు.



సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

తెరమీదకి మరికొందరు..

గద్వాల రూరల్: గట్టు ఎత్తిపోతల పథకం భూ సేకరణలో చోటుచేసుకున్న అక్రమాలు తవ్వేకొద్దీ బయటికి వస్తూనే ఉన్నాయి. మూడురోజుల కిందట 'అధికారుల్లో వణుకు' శీర్షికన గట్టు ఎత్తిపోతల పథకంలో చోటుచేసుకున్న అక్రమాలను 'సాక్షి' వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. తాజాగా ఓ డిప్యూటీ తహసీల్దార్, ఇద్దరు కొలతల ఉద్యోగులతోపాటు 20 ఏళ్లుగా భూసేకరణ కార్యాలయంలో పాతుకుపోయిన ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పాత్ర తెరమీదకు రావడం చర్చనీయాంశంగా మారింది. ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోయిన రైతులకు కాకుండా ఇతరులకు నష్టపరిహారం అందజేసి, ప్రభుత్వ సొమ్ము పక్కదారి పట్టించినట్లు తెలుస్తోంది. అధికారుల సర్వేలో తాము పొజిషన్‌లో లేమంటూ తప్పుడు నివేదికలు ఇచ్చి అన్యాయం చేశారని పలువురు రైతులు 'సాక్షి'తో వాపోయారు. అధికారులకు ముడుపులు చెల్లించిన వారికే ముందుగా పరిహారం ఇచ్చారని.. తమ భూములు ముంపునకు గురైనా పరిహారం రాలేదని కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నట్లు మరికొందరు రైతులు తమ గోడు వెల్లబోసుకున్నారు. ఈ తతంగమంతా అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా పేరుగాంచిన ఓ రెవెన్యూ డివిజనల్ అధికారి కనుసన్నల్లో జరిగిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమార్కుల సాయంతో రూ.కోట్ల పరిహారం కాజేశారని బాధిత రైతులు ఆరోపిస్తున్నారు. భూనిర్వాసితుల పరిహారం పక్కదారి పట్టిన విషయంపై జిల్లావ్యాప్తంగా అటు అధికార యంత్రాంగం, ఇటు రాజకీయ వర్గాల్లో దుమారం రేపుతోంది.

762 ఎకరాల భూసేకరణ..

గట్టు, కేటీదొడ్డి మండలాల్లో 33 వేల ఎకరాలకు సాగునీటిని అందించేందుకు అప్పటి ప్రభుత్వం రూ.581 కోట్లతో గట్టు ఎత్తిపోతలు చేపట్టింది. ఈ పథకంలో అప్రోచ్ కెనాల్, పంప్‌హౌస్, ప్రెషర్ మెయిన్ కెనాల్, రిజర్వాయర్ నిర్మాణాలే ప్రధానం. వీటి కోసం 975 ఎకరాల భూమి అవసరం. అందులో ఇప్పటి వరకు 762 ఎకరాల భూమిని సేకరించగా.. ఇంకా 213 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. కాగా.. ఇప్పటి వరకు 535 ఎకరాల భూమికి సంబంధించి బాధిత రైతులకు ఎకరాకు రూ.7.50 లక్షల చొప్పున రూ.40 కోట్లకుపైగా నష్టపరిహారం చెల్లించారు. ఇంకా 227 ఎకరాలకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉంది.

- భూ నిర్వాసితులకు నష్టపరిహారం మంజూరులో బయటపడుతున్న అక్రమార్కుల చిట్టా
- బినామీల పేర్లతో ప్రభుత్వ సొమ్ము పక్కదారి
- అప్పటి ఆర్డీఓపై వెల్లువెత్తుతున్న ఆరోపణలు
- సమగ్ర విచారణ జరిపితే మరిన్ని అక్రమాలు వెలుగులోకి

ఇక్కడే చక్రం తిప్పారు..

గట్టు ఎత్తిపోతల పథకం నిర్మాణానికి అవసరమైన భూమి సేకరణ ప్రక్రియ, నష్టపరిహారం చెల్లింపులను భూసేకరణ విభాగానికి అప్పగించారు. అప్పటి ప్రభుత్వ హయాంలో పనిచేసిన ఆర్డీఓ.. భూసేకరణ ఇన్‌చార్జ్ అధికారిగా బాధ్యతలు నిర్వర్తించారు. అయితే 2013 భూసేకరణ చట్టంలోని 'పొజిషన్' అనే అంశాన్ని అవకాశంగా మార్చుకుని జేబులు నింపుకొనే పథకం రచించారు. అందులో తన మాట వినే డీటీ, కొలతల ఉద్యోగులతోపాటు భూసేకరణ ఆఫీస్‌లోని ఔట్ సోర్సింగ్ సిబ్బందిని రంగంలోకి దించారు. ఎకరాకు చెల్లించే నష్టపరిహారంలో రూ.1–2 లక్షల వరకు వసూలు చేసేలా పురమాయించారు. 535 ఎకరాల భూమికి సంబంధించి బాధిత రైతులకు నష్టపరిహారం చెల్లించినట్లు అధికారిక లెక్కలు చెబుతుండగా.. అందులో సుమారు రూ.5 కోట్లకుపైగా బోగస్ రికార్డులు సృష్టించి కాజేశారనే ఆరోపణలున్నాయి. దీంతో నిజమైన భూ యజమానులు నష్టపరిహారం కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. బదిలీ అయిన సదరు అధికారి పేరిట పాత తేదీలతో సుమారు మూడు నెలల పాటు భూసేకరణ ఆఫీసులో లావాదేవీలు కొనసాగాయంటే.. సదరు అధికారి ఎంత పెద్దమొత్తంలో దోచుకున్నారో స్పష్టమవుతోంది.



గట్టు ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులు

చెల్లించే పరిహారంలో సైతం..

ఇప్పటి వరకు సేకరించిన భూమిలో ఇంకా 227 ఎకరాలకు రూ.17 కోట్లకుపైగా పరిహారం చెల్లించాల్సి ఉంది. ఇందులో కూడా పెద్దఎత్తున కాజేసేందుకు యత్నిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గట్టు ఎత్తిపోతల పథకం భూపరిహారంలో చోటుచేసుకున్న అక్రమాలపై సీబీఐ లేదా ఉన్నత స్థాయి న్యాయ విచారణ జరిపితే అవినీతి అధికారులతోపాటు కొందరు రాజకీయ నాయకుల పాత్ర వెలుగులోకి వస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఐదెకరాలు పోయింది..



నాకు సర్వే నం.147/6లో ఐదెకరాల భూమి ఉండగా.. గట్టు ఎత్తిపోతలలో ముంపునకు గురైంది. పరిహారం కోసం గద్వాల భూసేకరణ కార్యాలయానికి వెళ్లి అడిగితే 'సముద్రం ఉన్నప్పుడు రాకుండా, పిల్లకాల్వ ఉన్నప్పుడు వస్తే డబ్బులు ఎలా వస్తాయి.. అంతా అయిపోయింది.. నీ భూమిపై ఇతర వ్యక్తులు పొజిషన్‌లో ఉన్నట్లు అఫిడవిట్లు ఇచ్చారు.. నీవద్ద ఉన్న పాస్‌బుక్కులు చెల్లవ్' అంటూ మాట్లాడుతున్నారు. మా ఊరికి వచ్చి ఎవరిని విచారించినా నాకు భూమి ఉందని చెబుతారు. నా భూమికి రావాల్సిన పరిహారం ఇవ్వాలి.

– ప్రభుదాస్, కుచ్చినెర్ల, కేటీదొడ్డి మండలం

త్వరలోనే అందిస్తాం..

భూ సేకరణ కార్యాలయ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులు, సర్వేయర్లు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది అక్రమాలకు పాల్పడినట్లు తేలితే వారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం. అలాగే ఇప్పటి వరకు 535 ఎకరాలకు పరిహారం చెల్లించగా.. ఇంకా 227 ఎకరాలకు చెల్లించాల్సి ఉంది. మిగిలిన వారికి కూడా త్వరలోనే పరిహారం అందిస్తాం.

– సుబ్రహ్మణ్యం, ఎస్డీసీ

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ఎర్రవల్లిచౌరస్తా: ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొట్టిన ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలైన ఘటన ఇటిక్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటేష్ వివరాల మేరకు.. మల్దకల్ మండలం కుర్తిరావులచెర్వు గ్రామానికి చెందిన సందుల వెంకటేష్ (26), రాఘవ ద్విచక్ర వాహనంపై మంగళవారం రాత్రి షాద్‌నగర్‌కు బయల్దేరారు. ఈక్రమంలో నంది గోశాల సమీపంలో ఎర్రవల్లి–గద్వాల రహదారి పక్కన ఆగి ఉన్న లారీని ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో వెంకటేష్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. గాయపడిన రాఘవను స్థానికులు చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్, లారీ ఢీకొని వ్యక్తి..

మహబూబ్‌నగర్ క్రైం: ముందు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న వ్యక్తి లారీ టైర్ల కిందపడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వన్‌టౌన్ ఎస్‌ఐ సుధమాధురి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బీహార్‌కు చెందిన లాలన్‌యాదవ్(51) కుటుంబంతో కలిసి భూత్పూర్ శివారులో నివాసం ఉంటూ ఒక మిల్లులో పని చేస్తున్నాడు. అయితే బుధవారం మహబూబ్‌నగర్ పట్టణానికి వచ్చి తిరిగి భూత్పూర్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. పట్టణంలోని పాత పాలమూరు బ్రిడ్జి వద్ద ముందు వెళ్తున్న లాలన్ యాదవ్ బైక్‌ను వెనుక నుంచి టీఎస్ 08 యూబీ 6948 నంబర్ లారీ ఢీకొట్టింది. దీంతో బైక్‌పై నుంచి అతను కిందపడిపోయాడు. ఆ సమయంలో లారీ టైర్లు అతని పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు నితీష్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వెల్లడించారు.

బావిలో పడి గొర్రెలకాపరి మృతి

పెబ్బేరు రూరల్: గొర్రెల కాపరి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఈర్లదిన్నెకు చెందిన ఆడెం సింగోటం(59) గొర్రెలు కాసేవాడు. మంగళవారం గొర్రెలను మేపుకొని రాత్రి గ్రామ శివారులో నిలిపాడు. వరిగడ్డి కట్టుకొని, టార్చిలైట్ తీసుకొని రాత్రి ఇంటికి వెళ్తుండగా.. కదిరె రాముడు బావిలో అదుపుతప్పి పడిపోయాడు. గ్రామానికి చెందిన కార్తిక్, వెంకటేష్ గొర్రెల మంద వద్ద ఉన్న జీతగాళ్లకు అన్నం తీసుకెళ్తుండగా.. బావిలోంచి వెలుతురు కనిపించింది. వారు బావి వద్దకు వెళ్లి చూడగా.. బావిలో టార్చిలైట్ కనిపించింది. విషయాన్ని వారు గ్రామస్తులకు తెలియజేశారు. మృతుని భార్య ఆడెం మన్నెమ్మ టార్చిలైట్‌ను చూసి, నా భర్త బావిలో పడి ఉంటాడని తెలియజేసింది. మోటార్ల సాయంతో బుధవారం ఉదయం వరకు బావిలోని నీటిని తోడగా.. సింగోటం మృతదేహం లభించిందని ఎస్‌ఐ తెలియజేశారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

వాగులో పడి వివాహిత..

బాలానగర్: మండలంలోని నందారం శివారులో ఉన్న దుందుభి వాగులో పడి బుధవారం ఓ వివాహిత మృతిచెందినట్లు ఎస్‌ఐ తిరుప్పాజీ తెలిపారు. ఆయన కథనం మేరకు.. రాజాపూర్ మండలం రాఘవాపూర్‌కు చెందిన రాజుతో నందారం గ్రామానికి చెందిన మీసాల స్వప్న (28)కు ఏడేళ్ల కిందట వివాహం జరిగింది. భర్త మరణించడంతో ఆరేళ్లలోపు వయసున్న ఇద్దరు ఆడ పిల్లలతో రాఘవాపూర్‌లో ఉంటూ జీవనం సాగించేది. బుధవారం నందారం శివారులోని దుందుభి వాగులో ఓ మహిళ మృతదేహం కనిపించడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడకు చేరుకున్న పోలీసులు నదిలో నుంచి మృతదేహాన్ని బయటకు తీయగా స్వప్నగా గుర్తించారు. మూడు, నాలుగు రోజుల కిందటే ఘటన జరిగి ఉంటుందని.. రెండు కాళ్లు కట్టేసి నదిలో పడేసినట్లు అనుమానిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ఆస్పత్రికి తరలించి తల్లి మీసాల రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.


11 గొర్రెలు అపహరణ : పోలీసులకు ఫిర్యాదు

వెల్దండ: మండలంలోని కొట్రలో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పుణ్యమూర్తి బాలస్వామి అనే రైతుకు చెందిన 11 గొర్రెలను ఎత్తుకెళ్లారు. రోజులాగే మంగళవారం రాత్రి గొర్రెలను ఇంటి ఆవరణలో నిలిపాడు. బుధవారం ఉదయం లేచి చూసేసరికి 11 గొర్రెలు కనిపించలేదు. చుట్టుపక్కల వ్యవసాయ పొలాల్లో వెదికిన కనిపించకపోవడంతో వెల్దండ పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశారు.

అంతా 'అవినీతి'మయం

కాసుల కోసం కక్కుర్తి

- చేయి తడిపితేనే పనులు
- పలు శాఖల్లో తీరుమారని వైనం
- ఇబ్బందుల్లో సామాన్యులు



గండేడ్/మహమ్మదాబాద్: ఓవైపు రాష్ట్ర ప్రభుత్వం పాలనలో పారదర్శకతతో పాటు అవినీతి రహిత సమాజ నిర్మాణానికి కంకణం కట్టుకుంటే మరోవైపు అధికారులు సిబ్బంది తమతీరు మార్చుకోవడం లేదు. పలుచోట్ల ఏసీబీ దాడుల్లో పట్టుబడ్డా.. కాసుల కోసం కక్కుర్తి పడతున్నారు. జలగల్లా పట్టి పీడిస్తూ.. సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. ఉమ్మడి గండేడ్ మండలంలో పలు కార్యాలయాలు అవినీతి నిలయాలుగా మారుతున్నాయి. పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్ తదితర శాఖల్లో ఈ తతంగం కొనసాగుతున్నా.. పట్టించుకునే వారు కరువయ్యారు.

వసూళ్లకు నిలయం..

మహమ్మదాబాద్ పోలీస్‌స్టేషన్ వసూళ్లకు నిలయంగా మారింది. శాంతిభద్రతలను కాపాడుతూ బాధితులకు బాసటగా నిలవాల్సిన పోలీసులు భక్షకభటులుగా మారుతున్నారు. గండేడ్, మహమ్మదాబాద్ మండలాలకు కలిపి ఒక్కటే పోలీస్‌స్టేషన్. 49 గ్రామపంచాయతీల్లో ఏ సమస్య వచ్చినా మహమ్మదాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తమ గోడు వెళ్లబోసుకుంటారు. అక్కడికి వెళ్తే తమకు న్యాయం జరుగుతుందని బాధితుల నమ్మకం. కాని ఇక్కడ మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఫిర్యాదు ఇచ్చిన తర్వాత పెద్దమనుషుల సమక్షంలో రాజీ కుదుర్చుకున్నా డబ్బులు చెల్లించుకోక తప్పడం లేదు. కొందరు సిబ్బంది మరీ పనిగట్టుకుని చేతులు చాస్తున్నారు. సమస్యను బట్టి రేటు నిర్ణయించి కాసులు వసూలు చేస్తున్నారు. కొంత మంది పోలీసులు ఇందులో ఆరితేరారు. ఎంత మంది ఉన్నా.. బాహటంగా అడిగి తీసుకుంటున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మహమ్మదాబాద్ పోలీస్‌స్టేషన్

పోస్టుమార్టం రిపోర్టు రాయాలన్నా..

ఎవరైనా ప్రమాదాల్లో, హత్యకు గురైన సందర్భంలో తప్పక పోస్టుమార్టం చేయాలి. పోలీసులు రిపోర్టు రాయనిదే పోస్టుమార్టం చేయరు. దీని ఆసరాగా చేసుకుని రూ.3 నుంచి రూ.5 వేల వరకు డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

అక్రమ వ్యాపారానికి వత్తాసు..

మండలంలో పలు అక్రమ వ్యాపారాలు కొనసాగుతున్నాయి. ఇసుక, కట్టెల అక్రమ తరలింపుతో పాటు బియ్యం దందా తదితరవి కొనసాగుతున్నాయి. దీనికి పోలీసుల అండదండలు పుష్కలంగా ఉంటున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ప్రతి నెల మామూళ్లు అప్పజెప్పితే మరికొందరు ప్రతి వారం లెక్క అందజేస్తున్నట్లు సమాచారం. ప్రధానంగా ఇసుక ద్వారా పోలీసులకు మంచి రాబడి ఉన్నట్లు తెలుస్తోంది. ట్రాక్టరుకు రోజుకు రూ.వెయ్యి నుంచి రూ. 2వేల వరకు అక్రమ వ్యాపారులు ఇస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. నామమాత్రపు కేసులతో సరిపెట్టి అక్రమ వ్యాపారానికి వంత పాడుతున్నారు.

పంచాయతీరాజ్‌శాఖలోనూ..

పంచాయతీ రాజ్ విభాగంలోనూ అవినీతి కొనసాగుతుంది. ఆయా అధికార సిబ్బందికి ఎంతో కొంత ఇస్తేగాని పనులు చేసిపెట్టడం లేదు. కొన్ని చోట్ల పంచాయతీ కార్యదర్శులు సైతం చేతివాటం ప్రదర్శిస్తున్నారు. నంచర్ల, చౌదర్‌పల్లి పంచాయతీ కార్యదర్శులు డబ్బులు తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. ఇళ్ల అనుమతులు, ఇతర పనులు గ్రామ పరిధిలో ఏవి చేసినా కొందరు పంచాయతీ కార్యదర్శులు పర్సంటేజీలు వసూలు చేస్తున్నారు.

తీరు మారని వైనం...

ఉమ్మడి మండలంలో పలువురు ఏసీబీకి పట్టుబడ్డ ఆయా శాఖల్లో పనిచేసే అధికారుల్లో తీరు మారడం లేదు. గతంలో గండేడ్ తహసీల్దార్, ఆర్‌ఐలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. పీఏసీఎస్‌లో ఓ ఉద్యోగి ఓ రైతు నుంచి డబ్బులు తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. ఓ ఏఈ సైతం కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీ వలలో చిక్కారు. ఇటీవల నంచర్ల, చౌదర్‌పల్లి పంచాయతీ కార్యదర్శులు సైతం డబ్బులు తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. తాజాగా ఈ రెండు సంఘటనలు జరిగాయి. అంతలోనే మహమ్మదాబాద్ ఎస్‌ఐ సురేష్ ఓ కేసు విషయంలో రూ.20 వేలు డిమాండ్ చేసి మూడో వ్యక్తి ద్వారా డబ్బులు తీసుకుంటూ దొరికిపోయారు. ఇందులో ఓ కానిస్టేబుల్‌తో పాటు ఓ జిరాక్స్ దుకాణం యజమాని కూడా అడ్డంగా బుక్కయ్యారు. ఇన్ని సంఘటనలు జరుగుతున్నా అధికార సిబ్బందిలో మార్పు రావడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అవినీతిని అంతమొందించి బాధితులకు తగిన న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.

రెవెన్యూ శాఖలోనూ..

గండేడ్ మండలంలో రెవెన్యూ శాఖలో వసూళ్ల పర్వం కొనసాగుతుంది. ఇసుకతో పాటు రిజిస్ట్రేషన్లు, కల్యాణలక్ష్మితో పాటు ఇతర సర్టిఫికెట్లు పొందాలంటే చేయి తడపాల్సి వస్తోంది.



గండేడ్ తహసీల్దార్ కార్యాలయం

ట్రేడర్ల దోపిడీ



అచ్చంపేట అంబేడ్కర్ చౌరస్తాలో రోడ్డుపై ధాన్యానికి నిప్పుపెట్టి రాస్తారోకో చేస్తున్న రైతులు

- అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌యార్డులో పల్లీకి దక్కని గిట్టుబాటు ధర
- ఆగ్రహించిన రైతులు
- రోడ్డుపై పారబోసి వేరుశనగ దహనం
- వ్యాపారులు కుమ్మక్కై నట్టేట ముంచుతున్నారని ఆవేదన
- ధర కల్పించాలని నిరసన

అచ్చంపేట రూరల్: ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వడం లేదని, తమకు న్యాయం చేయాలని వేరుశనగ రైతులు అచ్చంపేటలో రోడ్డెక్కారు. తాము పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వడం లేదని, నూనెలకు మాత్రం ధరలు పెంచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌కు 412 మంది రైతులు పండించిన వేరుశనగ పంటను 20,063 బస్తాల్లో 5,015 క్వింటాళ్ల పల్లి తీసుకొచ్చారు. గరిష్ట ధర రూ.7,236, కనిష్ట ధర రూ.5,040లుగా మార్కెట్ అధికారులు ప్రకటించారు.

అంబేడ్కర్ చౌరస్తాలో రాస్తారోకో..


ప్రభుత్వం, మార్కెట్ అధికారులు ప్రకటించిన ధర కంటే తమ పంటకు తక్కువ ధర రావడంతో రైతులు ఆగ్రహించారు. మార్కెట్ సెక్రెటరీ నర్సింహులును రైతులు ప్రశ్నించారు. రైతులకు నచ్చజెప్పే క్రమంలోనే రైతులంతా గుమిగూడి ఒక్కసారిగా మార్కెట్ కార్యాలయంలోకి ప్రవేశించారు. అక్కడే బైఠాయించి గిట్టుబాటు ధరను పెంచాలని డిమాండ్ చేశారు. రైతులకు సీపీఎం నాయకులు మల్లేష్, శంకర్‌నాయక్, పలు సంఘాల నాయకులు మద్దతు పలికారు. ఇతర మార్కెట్ ధరలకు సంబంధించిన పత్రాలను రైతులకు సెక్రెటరీ చూయించినా వినలేదు. అనంతరం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాకు ఖాళీ బస్తాలు, కొంత ధాన్యం తీసుకెళ్లారు. అక్కడే స్వచ్ఛందంగా రైతులంతా కలిసి రాస్తారోకో చేపట్టారు. పల్లిని కొంత రోడ్డుపై పారబోసి దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడారు. ఆరుగాలం కష్టపడి పంటను మార్కెట్‌కు తీసుకొస్తే ఇష్టానుసారంగా ధర నిర్ణయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే కూడా తక్కువగా ఇస్తే ఎలాగని ప్రశ్నించారు. తమకు గిట్టుబాటు లేని ధరకు అమ్మితే అప్పుల పాలవుతామన్నారు. మధ్యదళారీ వ్యవస్థ అలాగే ఉందని వాపోయారు. ట్రేడర్లు ఇష్టానుసారంగా ధర నిర్ణయిస్తున్నారని, అమాయకులైన రైతులను మోసం చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఇతర ప్రాంతాల నుంచి ట్రేడర్లను అచ్చంపేటలోని స్థానిక ట్రేడర్లు రానివ్వడం లేదని, దీంతో స్థానిక ట్రేడర్ల రాజ్యమే నడుస్తుందన్నారు. రాస్తారోకో వద్దకు సీఐ రవీందర్, ఎస్‌ఐ రాము వచ్చి రైతుల సమస్యను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులు, చైర్‌పర్సన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. అక్కడికి రప్పించారు. వ్యాపారస్తులతో మాట్లాడి రైతులకు న్యాయం చేస్తామని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అరుణ చెప్పడంతో రాస్తారోకో విరమించారు. నాలుగు గంటల పాటు మార్కెట్ కార్యాలయం, చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు.

ట్రేడర్లు నిర్ణయించిందే ధర..



నాణ్యతగా ఉన్న వేరుశనగ పంటకు సరైన ధర ఇవ్వడం లేదు. ఎక్కువ మోతాదులో ఉన్న ధాన్యానికి తక్కువ ధర, తక్కువ మోతాదులో ఉన్న ధాన్యానికి ఎక్కువ ధరను ట్రేడర్లు నిర్ణయిస్తున్నారు. మార్కెట్‌లో పర్యవేక్షణ కన్పించడం లేదు. దిక్కుతోచని స్థితిలో ధాన్యం అమ్ముతున్నాం. – హరీష్‌రెడ్డి, రైతు, బాణాల, బల్మూర్ మండలం

రెండు రోజులుగా కాపలా...



మార్కెట్‌లో రూ.7 వేలకు పైగా మద్దతు ధర ఉన్నా రూ.5 వేలకు కూడా కొనడం లేదు. ధర కోసం రెండు రోజులు మార్కెట్‌లోనే ధాన్యానికి కాపలా ఉన్నా. మార్కెట్‌కు 20 క్వింటాళ్ల ధాన్యం తీసుకొచ్చా. మంగళవారం క్వింటాల్‌కు రూ.6,416 పలకగా.. అదే ధాన్యానికి బుధవారం రూ.6,030 పలికింది. ఇదే విషయాన్ని మార్కెట్ అధికారులకు చెబితే పొంతన లేని సమాధానం చెబుతున్నారు. అధికారులు, పాలకవర్గం స్పందించి న్యాయం చేయాలి. – లింగమయ్య, రైతు, చౌటపల్లి, అచ్చంపేట మండలం

ఇబ్బందులు కలగనివ్వం..



ప్రస్తుతం అన్ని మార్కెట్లో కంటే అచ్చంపేటలోనే అధికంగా వేరుశనగ పంటకు ధర ఉంది. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. అన్ని వసతులు కల్పిస్తున్నాం. దగ్గరుండి పర్యవేక్షణ చేస్తున్నాం. ట్రేడర్లతోనూ మాట్లాడుతున్నాం. నిబంధనలు పాటించని ట్రేడర్లపై చర్యలు తీసుకుంటాం. – నర్సింహులు, మార్కెట్ సెక్రెటరీ, అచ్చంపేట

వ్యవసాయ మార్కెట్‌కు వచ్చిన రైతులు 412 మంది	20,063 బస్తాలు
	5,015 క్వింటాళ్ల పల్లి రాక

మద్యం పట్టివేత

జడ్చర్ల: మండలంలోని ఆలూరు సమీపంలో ఉన్న దాబాలో అనుమతి లేకుండా నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. తమ సిబ్బంది సురేందర్‌కు దాబాలో మద్యం నిల్వలు ఉన్నాయని సమాచారం రాగా.. బుధవారం ఉదయం తనిఖీ నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా కింగ్‌ఫిషర్ 8 బాటిళ్లు, ఆఫీసర్ చాయిస్ 180 ఎంఎల్ 10 బాటిళ్లు, ఇంపీరియల్ బ్లూ (180 ఎంఎల్) 8 బాటిళ్లు, 90 ఎంఎల్ 15 బాటిళ్లు స్వాధీనపర్చుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు.

డ్రగ్స్ స్వాధీనం



నారాయణపేట: మక్తల్ మండలం జక్లేర్‌లోని అమాన్ మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్‌లో బుధవారం డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు తనిఖీలు చేపట్టారు. మెడికల్ దుకాణంలో అనుమతులు లేకుండా విక్రయిస్తున్న రూ.1.20 లక్షల విలువజేసే డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. లైసెన్స్ లేకుండా మందులను విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని డ్రగ్స్ కంట్రోల్ అధికారులు హెచ్చరించారు. ఈసందర్భంగా ఉమ్మడి జిల్లా అధికారులు దినేష్‌కుమార్, క్రాంతికుమార్, రఫీ షేక్, రవికిరణ్ ఉన్నారు.

దొంగకు దేహశుద్ధి.. పోలీసులకు అప్పగింత

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారు భీమా ఫేస్–2 కాల్వకు వేసిన వ్యవసాయ బోరు మోటార్ల విద్యుత్ తీగలు కొంతకాలంగా చోరీకి గురవుతున్నట్లు రైతులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పగటిపూట గస్తీ పెంచినా పోలీసులకు చిక్కకుండా దొంగలు తమ పని సాఫీగా కొనసాగిస్తూనే ఉన్నారు. బుధవారం ఓ దొంగ బోరుమోటార్ల దగ్గర తీగలను కత్తిరిస్తుండగా గుర్తించిన కొందరు రైతులు అప్రమత్తమై వెంటనే పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు దొంగను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎక్కడెక్కడ దొంగతనాలు చేశాడో విచారిస్తున్నామని ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు.



పట్టుబడిన దొంగ

ముగ్గురు సైబర్ నేరస్తుల అరెస్టు

గద్వాల క్రైం: ముగ్గురు సైబర్ నేరస్తులను పీటీ వారెంట్ ద్వారా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ రితిరాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజస్థాన్, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన జాముద్దిన్ అన్సారి, మహిర అజాద్, వాకీలు అమాయక వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని క్రెడిట్ కార్డు లిమిట్‌ను పెంచుకోవాలని.. తక్కువ ధరకు మొబైల్స్ సరఫరా చేస్తామని పలువురి వ్యక్తిగత ఖాతాల్లో నుంచి ఆన్‌లైన్ ద్వారా రూ.33 వేల నగదును అపహరించినట్లు ఫిర్యాదులు అందాయని తెలిపారు. ముగ్గురు నిందితులు మహబూబ్‌నగర్ పోలీసుల అదుపులో ఉండగా.. గద్వాల జిల్లాలోను వీరిపై కేసులు నమోదు కావడంతో పీటీ వారెంట్ ద్వారా అదుపులోకి తీసుకుని నిందితులను గద్వాల కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు.

మెనూ పాటించడం లేదంటూ రోడ్డెక్కిన విద్యార్థులు



కలెక్టర్‌ను కలిసేందుకు రోడ్డుపై పరుగులు తీస్తున్న గురుకుల విద్యార్థులు

ధరూరు: మండలంలోని మార్లబీడు శివారు నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం క్వార్టర్స్‌లో కొనసాగుతున్న కేటీదొడ్డి మండల గురుకుల పాఠశాల విద్యార్థులు మెనూ పాటించడం లేదంటూ బుధవారం రోడ్డెక్కారు. ఈ పాఠశాలలో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు మొత్తం 650 మంది విద్యార్థులు చదువుతున్నారు. బుధవారం మధ్యాహ్నం సుమారు 200 మంది విద్యార్థులు మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని, పలుమార్లు అడిగినా పట్టించుకోవడం లేదని, గత్యంతరం లేక రోడ్డుపైకి వచ్చినట్లు విద్యార్థులు వివరించారు. కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలు విన్నవించేందుకు వెళ్తుండగా.. విషయం తెలుసుకున్న రేవులపల్లి పోలీసులు, ఎంఈఓ సురేష్ మార్లబీడు వద్ద విద్యార్థులను అడ్డగించి విచారించారు. తామంతా పేద కుటుంబాలకు చెందిన వారమని.. ఇంటివద్ద పరిస్థితులు బాగోలేక గురుకుల పాఠశాల, కళాశాలలో చదువుకొంటున్నామని విన్నవించారు. ఇంటికి వెళ్లినా తల్లిదండ్రులు చదివించే స్తోమత లేదని, అటు ఇంటికి వెళ్లలేక.. ఇటు నాసిరకం భోజనం తినలేక పస్తులుండే పరిస్థితులు తలెత్తాయని వాపోయారు. కనీసం సబ్బుల బిల్లులు ఇవ్వడం లేదని, మెనూ ప్రకారం వారంలో రెండుసార్లు మాంసాహారం ఇవ్వాల్సి ఉన్నా.. అందించడం లేదని తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చొరవచూపి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని ఎస్‌ఐ విజయ్‌కుమార్, ఎంఈఓ సురేష్, మార్లబీడు గ్రామస్తులు హామీ ఇవ్వడంతో విద్యార్థులు శాంతించారు.

చోరీకి పాల్పడ్డ వ్యక్తి రిమాండ్

ఆత్మకూర్: వరుస చోరీలకు పాల్పడ్డ వ్యక్తిని పట్టుకొని కోర్టులో హాజరుపర్చగా.. జడ్జి ఆదేశానుసారంగా రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శివకుమార్, ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. వారు తెలిపిన వివరాలిలా.. మండలంలోని పిన్నంచర్ల ఆంజనేయస్వామి ఆలయంలో 2022 నవంబర్‌లో జరిగిన చోరీలో రూ.60వేలు విలువ చేసే వెండి కిరీటం, వెండి గద, వెండి మాల, ఇతర వెండి సామగ్రి చోరీ జరిగిందన్నారు. ఈ కేసుకు సంబంధించి వికారాబాద్ జిల్లా దోమ మండలం బడంపల్లికి చెందిన అంతరాష్ట్ర దొంగ దుద్యాల వెంకటయ్యను అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. ఈమేరకు బుధవారం కోర్టులో హాజరుపర్చగా నిందితుడిపై గతంలోను 19 చోరీ కేసులు ఉన్నాయని, న్యాయమూర్తి 14 రోజులపాటు రిమాండ్ విధించారని తెలిపారు.



ఆత్మకూర్‌లో పోలీసుల అదుపులో నిందితుడు

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

ఎర్రవల్లిచౌరస్తా: కులం పేరుతో దూషించిన వ్యక్తిపై కేసు నమోదైన సంఘటన కోదండాపురం పీఎస్ పరిదిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కృష్ణదేవ కథనం మేరకు వివరాలిలా.. ఎర్రవల్లి మండలం సాసనూలుకి చెందిన రవీంద్రచారి గత నెల 25వ తేదీన రాత్రి అదే గ్రామానికి చెందిన హరిజన్ రామాంజనేయులు ఇంటికి వెళ్లి భార్య హరిజన లలిత ముందు ఆమె భర్తను చంపుతానని బెదిరించి.. కులం పేరుతో దూషించినట్లు తెలిపారు. ఈ క్రమంలో పని నిమిత్తం బయటకి వెళ్లిన రామాంజనేయులు రాత్రి తిరిగి ఇంటికి రాగా జరిగిన విషయం లలిత చెప్పడంతో అతను మరుసటి రోజు గ్రామ పెద్దల సమక్షానికి ఈ విషయాన్ని తీసుకెళ్లాడు. ఈక్రమంలో వారికి ఎలాంటి న్యాయం జరగలేదు. దీంతో బుధవారం లలిత ఫిర్యాదు మేరకు రవీంద్రచారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

యువతి మిస్సింగ్..

జడ్చర్ల: బాదేపల్లికి చెందిన 19 ఏళ్ల యువతి శ్రీలత ఈ నెల 5వ తేదీ సాయంత్రం నుంచి కనిపించటం లేదని తల్లి కావలి జయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలియజేశారు. టైలరింగ్‌తోపాటు ఇళ్ల పనిచేస్తుందని, ఈ నెల 5న సాయంత్రం 4గంటలకు ఇంటి నుంచి పనికి వెళ్లి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ తెలియకపోవటంతో ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు.

వనపర్తి రెడ్‌క్రాస్ చైర్మన్ మృతి



ఖాజా కుత్బుద్దీన్ (ఫైల్)

వనపర్తిటౌన్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వనపర్తి చైర్మన్ ఖాజాకుతుబుద్దీన్ హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందారు. ఈ సందర్భంగా జిల్లా ఆస్పత్రిలో ఆయన చిత్రపటాన్ని ఉంచి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ నరేందర్‌కుమార్ మాట్లాడుతూ.. తుబుద్దీన్ మక్తల్ తహసీల్దార్‌గా పనిచేసి 2000 సంవత్సరంలో ఉద్యోగ విరమణ పొందారని, ఉమ్మడి జిల్లా రెడ్‌క్రాస్ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారని గుర్తుచేశారు. అనేక రక్తదాన శిబిరాలు నిర్వహించి రక్తహీనత, తలసేమియా వ్యాధిగ్రస్తులకు అండగా నిలిచారని తెలిపారు.

రెడ్‌క్రాస్ అభివృద్ధికి కృషి..

పాలమూరు: వనపర్తి జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ ఖాజా కుతుబుద్దీన్ అకాల మరణం చాలా బాధాకరమని రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్ అన్నారు. బుధవారం మహబూబ్‌నగర్‌లోని రెడ్‌క్రాస్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రెడ్‌క్రాస్ అభివృద్ధికి సుదీర్ఘకాలం సేవలందించారని తెలిపారు. కార్యక్రమంలో మనోహర్‌రెడ్డి, డా. సామ్యూల్, జగపతిరావు తదితరులు పాల్గొన్నారు.

బాలికపై లైంగికదాడి

మాగనూర్: మాగనూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన 13 ఏళ్ల బాలికపై లైంగికదాడి జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్‌ఐ మల్లేష్ వివరాల మేరకు.. బాలిక ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో అదే గ్రామానికి చెందిన యువకుడు (23) లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

One Sitting / Regular: 10th, Inter, NIOS, TOSS, APOSS, DEG, PG, Nagarjuna, SV, YVU, University, Guidelines for B.Tech failed students (KPHB) Ph: AES 9515390685, 9032284760.

SERVICES

CHANGE OF NAME

I, Shakira Begum D/o Shaik Mastan, R/o H-No: HIG-6, Housing board colony, Mahabubnagar Dist. T.S., hereby state that my name was wrongly printed in my husband Mohammed Asif Pasha's Passport No A6107572 which was recorded incorrectly as SHARIKA SHABNAM, My actual and correct name as per aadhar and Pan is SHAKIRA BEGUM

I, BUREMONI JYOTHI W/O BUREMONI CHANDU YADAV, R/O H-No:1-9-160/2, Simhagiri, New Gunj of Mahabubnagar Town & District, Telangana State, hereby state that my name was recorded in my Husband's Passport bearing No K9186753 as PAKANATI JYOTI YADAV, My actual and correct name as per Astrological is BUREMONI JYOTHI

WANTED

షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో నర్సులు, కాంపౌండర్స్, లేడీ సూపర్‌వైజర్స్, ఆయాలు, భార్యాభర్తలు & గార్డెన్ వర్క్ అవ్వలను చూసుకొనుటకు కావలెను. ఫోన్: 9391086981, 9248585901.

వర్క్‌ఫ్రమ్ హోమ్ వి.ఐ కంపెనీలో వర్కు చేయుటకు 10th to Degree అభ్యర్థులు కావలెను. గృహిణులు అర్హులే PT-10K, FT-20K సంపాదన. 20 వేకెన్సీస్ ఓన్లీ ☏ 93989 53099

భవిత విద్యార్థుల కోసం



గమనిక
- సాక్షి మేనేజ్‌మెంట్

6,100 పోస్టులతో డీఎస్సీ

- షెడ్యూల్ ప్రకటించిన ఏపీ ప్రభుత్వం
- నేడు టెట్‌కు, 12న డీఎస్సీకి నోటిఫికేషన్ల జారీ

సాక్షి, అమరావతి: ఏపీలో బీఈడీ, డీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. మొత్తం 6,100 పోస్టుల భర్తీకి డీఎస్సీ షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ పోస్టుల్లో 2,280 సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్‌జీటీ), 2,299 స్కూల్ అసిస్టెంట్లు (ఎస్‌ఏ), 1,264 ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లు (టీజీటీ), 215 పోస్టుగ్రాడ్యుయేట్ టీచర్లు (పీజీటీ), 42 ప్రిన్సిపాల్ పోస్టులు ఉన్నాయి. టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)తో పాటు డీఎస్సీ–2024 నోటిఫికేషన్లకు ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించింది. ఈ మేరకు గురువారం టెట్ నోటిఫికేషన్ విడుదల చేయనుంది. డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఈనెల 12న ఇవ్వనుంది. టెట్, డీఎస్సీకి పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్ http://cse.ap.gov.in ద్వారా చేసుకోవాలి. ఈ మేరకు బుధవారం సచివాలయంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్, కమిషనర్ సురేష్ కుమార్ వివరాలు వెల్లడించారు. నోటిఫికేషన్ ఇచ్చిన రోజు నుంచే ఆయా పరీక్షలకు ఆన్‌లైన్ దరఖాస్తులు కూడా స్వీకరిస్తారు. మొత్తం ప్రక్రియను పూర్తి చేసి, ఏప్రిల్ చివరి నాటికి అభ్యర్థులకు పోస్టింగ్ ఇస్తామని, వారు వచ్చే విద్యా సంవత్సరంలో బోధన కూడా చేపడతారని మంత్రి బొత్స తెలిపారు. తమ ప్రభుత్వం వచ్చాక ఇప్పటివరకు 14,219 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిందన్నారు. పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ మాట్లాడుతూ.. ఏపీ టెట్, డీఎస్సీ పరీక్షలు రెండింటినీ ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ)గా నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

ఏపీ టెట్, డీఎస్సీ–2024 షెడ్యూల్..

అంశం	టెట్	డీఎస్సీ
నోటిఫికేషన్	ఫిబ్రవరి 8	12
ఫీజు చెల్లింపు	ఫిబ్రవరి 17	21 వరకు
దరఖాస్తు ప్రక్రియ	ఫిబ్రవరి 18	22 వరకు
ఆన్‌లైన్ నమూనా పరీక్ష	ఫిబ్రవరి 19	24
హాల్‌టికెట్లు	ఫిబ్రవరి 23 నుంచి	మార్చి 5 నుంచి
పరీక్ష నిర్వహణ	ఫిబ్రవరి 27 నుంచి మార్చి15	మార్చి 9 30 వరకు
ప్రాథమిక కీ	మార్చి 10	31
తుది కీ	మార్చి 13	ఏప్రిల్ 2
ఫలితాల ప్రకటన	మార్చి 14	ఏప్రిల్ 7



ఏడు రంగుల ఆంధ్ర ధనుస్సు

అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా రూ.2.86 లక్షల కోట్లతో ఓటాన్ అకౌంట్ బడ్జెట్

విద్య, వైద్యం, వ్యవసాయం, సాగునీటికి ప్రాధాన్యం

ద్రవ్య, రెవెన్యూ లోటు తగ్గించే చర్యలు

నాలుగు నెలలకు రూ.88,215 కోట్ల వ్యయానికి అసెంబ్లీకి ప్రతిపాదన



'రోటి, కపడా, ఔర్ మకాన్' ఎవరు అవునన్నా, కాదన్నా ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ఇదో నినాదం. ప్రజలకు వీటిని సమకూర్చడం పాలకుల కనీస బాధ్యత. ఇవి అందుబాటులో ఉన్నప్పుడే ఏ కుటుంబమైనా అభివృద్ధి దిశగా అడుగులు ముందుకు వేయడానికి ఉపక్రమిస్తుంది. వీటిని విస్మరించి, గ్రాఫిక్స్‌తో ఎన్ని మేడలు కట్టినా అవి నీటి మూటలేనని చరిత్ర చెబుతోంది. ప్రజల ఆనందాన్ని, వారి బాగోగులను చూసి ఆనందించే వాడే అసలైన పాలకుడని కూడా చరిత్ర వెల్లడిస్తోంది. తాడిత, పీడిత, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు బాసటగా నిలిచినప్పుడే ప్రజా రంజక పాలన అనిపించుకుంటుంది. విద్య, వైద్యం, వ్యవసాయం.. ఈ మూడు రంగాల్లో చేయూత అందిస్తే చాలు, ప్రజలు స్వయం సమృద్ధి దిశగా అడుగులేస్తారని విశ్వ వ్యాప్తంగా విఖ్యాత ఆర్థిక నిపుణులు నొక్కి వక్కాణిస్తుండటం తరచూ వినిపిస్తోంది. ఈ మూడు రంగాల అభ్యున్నతికే ఎన్నో దేశాలు, రాష్ట్రాలు సతమతం అవుతున్న వేళ.. ఇంతకు మించిన సంక్షేమాభివృద్ధిని సాకారం చేస్తూ మన రాష్ట్రంలో వైఎస్ జగన్ ప్రభుత్వం వడివడిగా అడుగులు ముందుకు వేస్తోంది. నవరత్నాల పథకాలు, సప్త స్వరాల్లాంటి థీమ్‌ల ద్వారా ప్రజలకు మరింత మెరుగైన జీవనాన్ని అందించాలనే తపన, తాపత్రయం.. బడ్జెట్‌లో పెద్దపీట వేయడం ద్వారా కళ్లకు కడుతోంది.

రంగాల వారీగా కేటాయింపులు (రూ.కోట్లలో) ₹

విద్య 33,898	గ్రామీణాభివృద్ధి 17,816	వ్యవసాయం, అనుబంధ రంగాలు 14,236	గృహ నిర్మాణాలు 7,062	బీసీ సంక్షేమం 29,001.31	ఎస్టీ సంక్షేమం 4,133.73
వైద్య, ఆరోగ్యం 17,916	పట్టణాభివృద్ధి 9,546	సాగునీరు 12,038	సంక్షేమం 44,668	ఎస్సీ సంక్షేమం 9,291.55	మైనారిటీల సంక్షేమం 2,242.36

సంక్షేమ శకం



రూ.2,86,389.27 కోట్లతో బుగ్గన ఓటాన్ అకౌంట్ బడ్జెట్

- మన రాష్ట్రానికి ధృడమైన, ఉజ్వల భవిష్యత్తు
- ఏడు ప్రధాన అంశాలతో సీఎం జగన్ వినూత్న పాలన
- గతంలో రెవెన్యూ వృద్ధి రేటు 6 శాతం.. ఇప్పుడు 16 శాతం

ఐదేళ్లలో జీఎస్‌డీపీ వృద్ధి రేటులో 14 నుంచి 4వ స్థానానికి ఎగబాకాం

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గత ఐదేళ్లలో ఆర్థికాభివృద్ధితో సంక్షేమ రాజ్యాన్ని నెలకొల్పిందని ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ చెప్పారు. రానున్న కాలంలో రాష్ట్రానికి ధృడమైన, ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. బుధవారం అసెంబ్లీలో రూ.2,86,389.27 కోట్లతో 2024–25 ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన బుగ్గన తనకు వరుసగా ఐదేళ్లుగా ఈ అవకాశాన్ని కల్పించిన ముఖ్యమంత్రి జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. సమాజంలో అత్యంత బలహీనులకు ప్రాధాన్యం ఇవ్వడంలో దివంగత వైఎస్సార్ నిబద్ధత, సామాజిక న్యాయం కోసం కృషి చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. అసమానతలను రూపుమాపడం, వెనుకబడిన వర్గాలకు రక్షణ, సాధికారత, నాణ్యమైన విద్య, వైద్యం, పోషణ, జీవనోపాధి కల్పించటాన్ని నైతిక బాధ్యతగా భావిస్తూ రాష్ట్ర పునర్ నిర్మాణానికి శాయశక్తులా కృషి చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా ఏడు అంశాలు సుపరిపాలిత ఆంధ్ర, సామర్థ్య ఆంధ్ర, మన మహిళా మహారాణుల ఆంధ్ర, అన్నపూర్ణ ఆంధ్ర, సంక్షేమాంధ్ర, సంపన్న ఆంధ్రా, భూ భద్ర ఆంధ్ర పేరుతో సీఎం జగన్ చేపట్టిన కీలక సంస్కరణలు సత్ఫలితాలనిచ్చాయంటూ రంగాల వారీగా ప్రగతిని వివరించారు. ఉదయం 11.04 గంటలకు ముహూర్తం ప్రకారం బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన బుగ్గన తన ప్రసంగంలో గాంధీజీ, అబ్రహాం లింకన్, కోఫీ అన్నన్, అమర్త్యసేన్, బీఆర్ అంబేడ్కర్, వివేకానందుడి సూక్తులను ఉటంకిస్తూ మధ్యాహ్నం 1.05 గంటల వరకు సుదీర్ఘంగా మాట్లాడారు. పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమరనాథ్ శాసన మండలిలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఐదేళ్లలో 'సుపరిపాలిత ఆంధ్ర'గా..

గడప గడపకు ప్రభుత్వ సేవల ద్వారా బాధ్యతాయుత పాలన

ఎటువంటి లోపాలు లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు

సీఎం జగన్ ప్రభుత్వ ఐదేళ్ల పాలనా సంస్కరణలను ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి బుగ్గన

వెలుగు జిలుగుల అన్నపూర్ణ ఆంధ్ర

ఈ 57 నెలల్లో పండుగలా మారిన వ్యవసాయ రంగం

- అడుగడుగునా అన్నదాతను చేయపట్టి నడిపించిన ప్రభుత్వం
- కొత్త పుంతలు తొక్కుతున్న వ్యవసాయ అనుబంధ రంగాలు
- వైఎస్సార్ రైతు భరోసా, ఉచిత పంటల బీమా, పెట్టుబడి సాయం

ఇదిగో.. సామర్థ్య ఆంధ్ర!

సీఎం జగన్ పాలనలో అనతి కాలంలోనే సామర్థ్య ఆంధ్రగా ఆవిర్భావం

మౌలిక వసతులతో... రాష్ట్రం సుసంపన్నం

మౌలిక సదుపాయాల కల్పనకు రూ.43,307.21 కోట్లు

జనరల్ ఆస్పత్రికి రోగుల తాకిడి



పాలమూరు: మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి రోజురోజుకు ఓపీ రోగులతోపాటు అడ్మిట్ కేసులు పెరుగుతున్నాయి. దీంతో చాలామందికి ఈసీజీ సేవలు అవసరమవుతున్నాయి. అయితే ఉమ్మడి జిల్లాకు పెద్దదిక్కు అయిన జనరల్ ఆస్పత్రిలో ఒకే ఒక్క ఈసీజీ మిషన్ ఉండటంతో నిత్యం రద్దీ నెలకొంటోంది. బుధవారం ఆస్పత్రిలోని ఈసీజీ విభాగం దగ్గర జనాలు క్యూకట్టారు. దీంతోపాటు ఎక్స్‌రే విభాగం దగ్గర కూడా అదే పరిస్థితి కనిపించింది. ప్రధానంగా ఓపీ కౌంటర్స్ కూడా సరిపోకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. మరో రెండు ఓపీ కౌంటర్స్ పెంచాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

రామన్‌పాడు నీటి మట్టం 1,019 అడుగులు

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో బుధవారం పూర్తి నీటి మట్టం 1,019 అడుగులకు చేరి నిలకడగ కొనసాగుతోంది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలియజేశారు.

నెమలి అప్పగింత



నవాబుపేట: నవాబుపేట మండలం కామారం సమీపంలో ఓ నెమలిని కుక్కలు వెంటాడుతుండగా.. గ్రామానికి చెందిన రైతు లక్ష్మణ్ రక్షించారు. అచేతన స్థితిలో ఉన్న నెమలిని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. సమాచారం అందుకున్న ఫారెస్ట్ అధికారులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని నెమలిని స్వాధీనం చేసుకున్నారు. ప్రథమ చికిత్స అనంతరం నెమలిని పిల్లలమర్రి పార్కుకు తరలించినట్లు వారు తెలిపారు.

పీయూ వీసీ చాంబర్‌కు తాళం

- రెండున్నర గంటలపాటు వైస్‌చాన్స్‌లర్ నిర్బంధం
- ఉద్రిక్తతకు దారితీసిన ఏబీవీపీ చలో పీయూ కార్యక్రమం
- డిమాండ్లు నెరవేర్చాలని 5 గంటల పాటు ఆందోళన
- పోలీసుల రంగప్రవేశంతో వెనక్కి తగ్గిన విద్యార్థి సంఘం నాయకులు



పీయూ అడ్మినిస్ట్రేషన్ భవనం ఎదుట నిరసన వ్యక్తంచేస్తున్న ఏబీవీపీ నాయకులు



వీసీ చాంబర్‌కు వేసిన తాళం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన చలో పీయూ కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. పాలమూరు యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు భారీగా పీయూ వద్దకు చేరుకున్నారు. ముందుగా రాయచూరు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తంచేశారు. అనంతరం పీయూ మెయిన్ గేట్ నుంచి అడ్మినిస్ట్రేషన్ భవనం వరకు ర్యాలీగా చేరుకుని.. వీసీ చాంబర్‌లోకి దూసుకెళ్లారు. ఈసందర్భంగా వీసీ, విద్యార్థి సంఘాల నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. చాంబర్ నుంచి వీసీ బయటికి వచ్చి విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థుల డిమాండ్లను నిర్ణీత సమయంలోగా నెరవేరుస్తామని ఒక కాగితంపై రాసివ్వాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. అందుకు వీసీ అంగీకరించకపోవడంతో పరిస్థితులు మరో సారి ఉద్రిక్తంగా మారాయి. చాంబర్‌లోకి వీసీ వెళ్లకుండా విద్యార్థులు ఘెరావ్ చేశారు. పోలీసులు సైతం విద్యార్థులను నిలువరించలేని పరిస్థితి నెలకొంది. ఎట్టకేలకే వీసీ చాంబర్‌లోకి వెళ్లగా.. విద్యార్థి సంఘం నాయకులు వీసీ చాంబర్‌కు తాళం వేశారు. వీసీ చాంబర్‌కు వేసిన తాళం తీయాలని పోలీసులు విద్యార్థి నాయకులపై ఒత్తిడి తీసుకొచ్చినా ఫలితం లేకపోయింది. దీంతో రెండున్నర గంటల పాటు వీసీ చాంబర్‌లోనే ఉండిపోవాల్సి వచ్చింది. వీసీ చాంబర్ తెరువకపోతే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని పోలీసులు హెచ్చరించడంతో విద్యార్థి సంఘం నాయకులు వెనక్కి తగ్గి తాళంచెవి ఇచ్చారు. అప్పటి వరకు వీసీ చాంబర్‌లోనే నిరీక్షించాల్సి వచ్చింది.

సమస్యలు పరిష్కరించాలి..

పీయూలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ అన్నారు. యూనివర్సిటీ పరిధిలో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులరైజ్ చేయాలని, కోర్సుల వారీగా సెమిస్టర్ ఫీజులు తగ్గించాలని, సరైన వసతులు లేని ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలల్లో ప్రయోగశాలలు ఇతర వసతులు కల్పించాలన్నారు. బీఈడీ కోర్సుల్లో అక్రమంగా వసూలు చేసే డెవలప్‌మెంట్ ఫీజులతో పాటు కళాశాలల్లో అడ్మిషన్ కోసం వసూలుచేసే ఫీజులను రద్దు చేయాలన్నారు. ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక సప్లమెంటరీ నిర్వహించాలని.. డిగ్రీ, పీజీ సెమిస్టర్ హాల్ టికెట్‌లో సబ్జెక్టుతో పాటు జరిగే పరీక్ష తేదీని కూడా ప్రకటించాలన్నారు. రీవాల్యుయేషన్, రీకౌంటింగ్ దరఖాస్తులు చేసుకున్న వారికి నిర్ణీత గడువులోగా ఫలితాలు ఇవ్వాలని అన్నారు. యూనివర్సిటీ హెల్త్ సెంటర్‌లో వసతులు మెరుగుపర్చి, అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలో బోధన, బోధనేతర సిబ్బందిని నియమించాలన్నారు. కార్యక్రమంలో సంఘటన్ మంత్రి విభాగ్ నరేంద్ర, జిల్లా సంఘటన్ మంత్రి కన్వీనర్ తేజ, కన్వీనర్ సతీష్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అర్జున్, జగదీష్, సురేష్, నరేష్, హరీష్ రావు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు..
యూనివర్సిటీలో విద్యార్థులు బంద్‌ల పేరుతో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. యూనివర్సిటీలో ఏబీవీపీ విద్యార్థులు ధర్నా చేపట్టి.. హాస్టల్స్ సమస్యలు ఉన్నాయని, కళాశాలల్లో మౌళిక వసతులు లేవని నిరసన చేశారని తెలిపారు. తమ దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను వెంటనే పరిష్కరిస్తామని, వాస్తవాలు తెలుసుకోకుండా ధర్నా చేయడం మంచి పద్ధతి కాదన్నారు. టెండర్ దారులు నిర్లక్ష్యం వహిస్తే బిల్లులు ఆపి, నోటీసులు ఇస్తామని చెప్పారు.

అభయాంజనేయుడికి ఒంటెవాహన సేవ

ఊర్కొండ: మండలంలోని ఊర్కొండపేటలో వెలసిన అభయాంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి ఒంటెవాహన సేవ నిర్వహించారు. అలాగే ఉదయం ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర పూజలు జరిపారు. ఉత్సవాల నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మరికొందరు ఒంటె వాహన సేవలో పాల్గొని తరించారు. కార్యక్రమంలో ఆలయ, ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీనివాసులు, రమేష్‌నాయక్, గోపాల్, అర్చకులు శ్రీనివాస్‌శర్మ, ప్రవీణ్, దత్తాత్రేయశర్మ, సిబ్బంది సత్య చంద్రారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



స్వామివారికి ఒంటె వాహన సేవ నిర్వహిస్తున్న భక్తులు

భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో బిహార్ ఎమ్మెల్యేలు



బిహార్ ఎమ్మెల్యేలతో అధికారులు

దోమలపెంట: శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రాన్ని బుధవారం అచ్చంపేట ఎమ్మెల్యే డా. వంశీకృష్ణతో కలిసి బిహార్ ఎమ్మెల్యేలు సందర్శించారు. కేంద్రం సీఈ సూర్యనారాయణ, ఎస్ఈ (ఓఅండ్‌ఎం) ఆదినారాయణ, డీఈ శ్రీనివాసరెడ్డి కేంద్రం నిర్వహణ, విద్యుదుత్పత్తి, సామర్థ్యం తదితర వివరాలను ఎమ్మెల్యేలకు వివరించారు.

హక్కుల పరిరక్షణకు సంఘటితమవుదాం



తెలుగు, ముదిరాజ్ కులస్తుల ఆత్మీయ సమ్మేళనంలో అభివాదం చేస్తున్న నాయకులు

కొల్లాపూర్: జాతి హక్కుల పరిరక్షణకు తెలుగు, ముదిరాజ్ కులస్తులు సంఘటితంగా ముందడుగు వేయాలని ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహన్‌రావు, జాతీయ గౌరవ అధ్యక్షుడు భూపతి ముదిరాజ్, తెలుగు, మత్స్యకారుల రాష్ట్ర అధ్యక్షుడు లోకబోయిన రమణ అన్నారు. బుధవారం కొల్లాపూర్‌లో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు జూపల్లి రవీందర్ అధ్యక్షతన తెలుగు, ముదిరాజ్ కులస్తుల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేయగా.. హాస్య నటుడు బిత్తిరి సత్తి, హైకోర్టు న్యాయవాది డీఎల్.పాండు, మహబూబ్‌నగర్ కాంగ్రెస్ నాయకుడు సంజీవ్ ముదిరాజ్ హాజరయ్యారు. సమావేశంలో వారు మాట్లాడుతూ తెలుగు, ముదిరాజ్‌లను బీసీ ఏ జాబితాలో చేర్చాలని, రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలన్నారు. తెలుగు, ముదిరాజ్ కులస్తులు సంఘటితమైతే రాజకీయ, సామాజిక అభివృద్ధి సాధ్యమవుతుందని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చూపుదామన్నారు. పార్టీలకు అతీతంగా జాతీ సంక్షేమానికి పాటుపడాలని వారు కోరారు. కార్యక్రమంలో తెలుగు,ముదిరాజ్ సంఘాల నాయకులు వాకిటి ఆంజనేయులు, బయ్యా వెంకటస్వామి, కుమారస్వామి, మధుసూధన్, సీరజ తదితరులున్నారు.

చిన్నారి ఊపిరితిత్తుల్లో గాజు ముక్క తొలగింపు



గాజు ముక్క తొలగించిన వైద్య బృందం

పాలమూరు: ప్రమాదవశాత్తు పది నెలల చిన్నారి ఊపిరితిత్తుల్లో ఇరుక్కుపోయిన గాజు ముక్కను ఎస్‌వీఎస్ వైద్యులు విజయవంతంగా తొలగించారు. ఇటీవల పది నెలల చిన్నారి ఇంట్లో ఆడుకుంటూ గాజు ముక్కను మింగడంతో గొంతు నుంచి లోపలి భాగానికి జారుకుంది. చిన్నారి తల్లిదండ్రులు ఎస్‌వీఎస్‌లోని ఊపిరితిత్తుల విభాగంలో ప్రొఫెసర్ డాక్టర్ తుమ్మూరు వెంకటేశ్వరరెడ్డిని సంప్రదించారు. దీంతో ఆయన సదరు చిన్నారి ఛాతి ఎక్స్‌రే, సీటీ స్కాన్ తీసి చూడగా గాజు ఎడమ ఊపిరితిత్తిలో ఉందని గుర్తించి.. ఆ తర్వాత వైద్య బృందం దాదాపు రెండు గంటల పాటు రిజిడ్ బ్రాంకోస్కోపి పద్ధతి ద్వారా గాజు ముక్కను విజయవంతంగా తొలగించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి యాజమాన్యం వైద్య బృందాన్ని అభినందించారు.